# జలయంత్రం

వీరాజీ

ఆ వూళ్ళో ప్రవేశించడానికి భయపడ్డట్లు, వో మహానది దాని ప్రక్కనించే తప్పుకుని పారిపోతూంటుంది! అయినా ఆ నదిని చీల్చి దాని పాయలను ఆ వూళ్లో నుంచి పంట కాల్వలుగా పంపిస్తున్నారు. ఈ కాల్వలను, కాల్వగట్లను వాడుకోడం ఆ వూళ్ళో జనానికి తెలిసినంతగా వెనిస్ మహానగర వాసులకి కూడా తెలియదేమో! అలాంటి కాల్వల్లో వొకదాని వొడ్డున మెత్తని పచ్చిక బయలు పెంచేసి, దాన్నో నందనోద్యానవనం చేసే ప్రయత్నం ప్రారంభమైపోయింది ఆ వూళ్లో!

ఊళ్ళో వాళ్ళు తప్ప - పై వూళ్ళ వాళ్ళందరూ కూడా వేరే వార్తలు లేక యీ వార్తను ప్రముఖంగా వేసిన పత్రికలు చదువుకుని వుడుక్కు చచ్చివుంటారు. కాని ఆ వూళ్ళోవాళ్ళు మాత్రం — అక్కడ మొక్కలు నాటి వాటికి కుండీలు కడుతూన్న కూలీల నడిగారు...

"నాయనలారా! మీ రెందులకీ శ్రమ పడుతున్నారు"అని.

"ఈ శ్రమంతా యిక్కడ పార్కు వేయడానికి...యీ సంబరమంతా యీ కాలిబాట మీద పార్కుని ... గవర్నర్ గారొస్తారంటా...ఆయనకి చూపించటానికి" అని చెప్పాడు కూలీల మేస్త్రీ...

"వోహో! గవర్నరు గారు కొత్తగా వొస్తున్నారు కనుక వారికీ నగరం గొప్పతనం చూపెట్టడానికి ముస్తాబు చేస్తున్నారన్న మాట! అనుకుంటూ ఆ వూళ్ళోనే పుట్టిపెరిగిన చిరంజీవిరావు ఆశ్చర్యపోయాడు!

నీళ్ళపంపులు బిగించారు. మంచినీళ్ళ గొట్టాలనుంచి...వొహూ!మని "నీరు" జుంయ్‌మని "నీళ్ళు" ... వెనకటికి భీష్ముడు అంపశయ్యమీద పడుకున్నప్పుడు అర్జునుడు భూమ్మీదనుండి బాణాన్ని భూగర్భంలోకి దింపి, పాతాళగంగని లాగితే వచ్చినట్లు వస్తోంది.

చిరంజీవిరావుకి ఎందుకో "అంపశయ్య జ్ఞాపకం వచ్చింది.

చిరంజీవిరావు "ఈ పార్కు ఎందాకా వేస్తారు?"అన్నాడు...

"వో! అందాకా ... ఆ పైన ఐమురాస్తాలు - కలిసే జంక్షన్ వుంది చూడు.అందాకా వేస్తారు.

"ఎందుకనో?"

"ఎందుకనో ఏమిటి? అక్కడ, ఆ జంక్షన్‌లో పెద్ద "కుండీ"వుంది చూడలేదా? అయ్యో నువ్వు?" కార్మికవనిత అనసూర్య చిరంజీవిరావుని జాలిగా చూసి అడిగింది...

"నాదీ వూరేలే" అంటూ కదిలాడు చిరంజీవిరావు.

కూలమ్మాయి పేరు 'అనసూర్య'అని తెలియదుగానీ చిరంజీవిరావుకి - ఆ నగరంలో వున్న పార్కు సెంటర్‌లో బ్రహ్మాండమైన నీళ్ళకుండీ ... కుండీ మధ్య సిమెంటు పద్మం-దాన్ని ఆవరించిన వలయాకారపు చప్టా-యివన్నీ చిరంజీవిరావుకి తెల్సు. కొన్ని సంవత్సరాల క్రితం దాని మీద ఒక రాజకీయ నాయకుడి కంచుబొమ్మ వుండేది..."ఉక్కు" కోసం కంచుబొమ్మని వూడపీకేశారు జనం...ఆ తరువాత జంక్షన్‌లోవున్న ఆ ఎత్తయిన మండపం మీద కొన్నాళ్ళు విఘ్నేశ్వరుడి బొమ్మ-వో చవితి వుదయాన ఎవరెక్కించారో తెలియదుగానీ- ఎక్కి కూర్చుంది!

ఆ జంక్షన్ చాలా పెద్దది.

వూళ్ళో కొన్ని ప్రత్యేకతలు మరే సెంటర్‌కీ లేనివి-యీ సెంటర్‌కి వున్నాయి. ఐదురోడ్ల కూడలిఅది! కానిఅక్కడ ప్రమాదం జరిగితే-చిరంజీవిలాంటివాడు ఏ లారీ క్రిందో, సిటీబస్ క్రిందో పడితే-దగ్గరలోనే జనరల్ ఆసుపత్రి వుంది కనుక — భూమ్మీద నూకలు చిందుకోనక్కరలేదు— వూపిరుండగానే తీసుకెళ్లి ఆస్పత్రిలో పారేస్తారు. అంతేగాదు-

యావదాంధ్ర దేశానికి క్షత్రగాత్రుని పేరు ప్రఖ్యాతులు మర్నాటికల్లా అందిపోతాయ్! దగ్గరలోనే దినపత్రికలున్నాయి!

ఆ సెంటర్ని రంగు రంగుల దీపాలకాంతులను కలుపుకుంటూ నగర బాటసారుల కంటికి యింపునిస్తూ నీటిధారలు ఉవ్వెత్తున లేస్తూ పడిలేచే ఆ "జలతరంగాల"సోయగానికి చూపరులు అచ్చెరువందాలన్న గొప్పకోరిక ఎవరికైనా కలుగుతుంది. చిరంజీవిరావుకున్న యీ చిన్నకోరిక గవర్నర్ రాదిడం కోసమైనా నెరవేరుతోవం అంటే – చిరంజీవిరావు పరమానంద భరితుడై పోయాడు.

ఆ సెంటర్లో "విగ్రహాలకి" అల్పాయుష్షు ఖాయంగా వుంటుంది కనుక–ఒక 'నీటి ఫువ్వారం' అనగా ఒక జలయంత్రం అర్థాత్ ఒక వాటర్ ఫవుంటెన్ను ఏర్పాటు చేస్తున్నారు – అన్నవైనం చిరంజీవిరావు స్వయంగా చూస్తూ తన కళ్ళను తాను నమ్మలేక కాళ్లు తడబడి, ఒక సిటీబస్కి మరొక లారీకి మధ్యన పడిపోయాడు–"పోయేవాడే" కాని... యీ భూమ్మీద నూకలున్నవాడు కనుక బ్రతికిపోయాడు.

జలయంత్రం ఏర్పాటు పూర్తయింది! అప్పటికి అర్ధరాత్రి దాటింది. తెల్లారితే "బాటప్రక్కనే పార్కు"కి పాలకులు, ప్రముఖులు, పత్రికలవాళ్ళు, ఫొటోగ్రాఫర్లు అంతాముహూర్తం వేళకి ఒక్కక్షణం తప్పకుండా వచ్చేస్తారు.

కాంట్రాక్టర్ను, కూలీలు, వాళ్ళ ఖాయిదాదారులు తెల్లార్లూ కాళ్ళూ, చేతులూ ముక్కలు కొట్టుకుంటూనే వున్నారు. వాళ్ళు పూర్తి చెయ్యడానిక్కి తంటాలు పడుతున్న "పాంథోద్యానవనం" కొసని "ఇక్కడిదాకా అందచందాలు, ముస్తాబూ చాలు. ఈ సెంబరుదాటి వి. ఐ. పి. లు ముందుకి పోకుండా నేనడ్డం పడతాను" అంటున్నట్లున్న ఆ పెద్ద వాటర్ ఫవుంటెన్ దాకా, ఆ ముందు రోజు రాత్రంతా ఒకటే పెళ్ళి సందడిలాంటి హడావుడి.




రంగులు, హంగులు, తోరణాలు, స్వాగత "ద్వారాలు" గబ గబా లేచాయి. మర్నాడుదయం మారిపోయిన ఈ సెంటర్ని చూసి తెల్లబోయినట్లు మరింత "ఎండ"గా లేచాడు సూర్యుడు.

ఆ వూళ్ళోనే పుట్టి పెరిగిన చిరంజీవిరావు ఊరి చరిత్రే మారిపోతుందనుకున్నాడు. చాటంత మొఖం చేసుకున్నాడు.

ఆ మధ్యాహ్నానికల్లా ట్రాఫిక్ రూల్సన్నీ మారిపోయాయి. తాత్కాలికంగా వి.ఐ.పి లు వచ్చే దారి కటూ యిటూ, సమీపంలోనూ వున్న సందుల్లోని గొందుల్లోకి రిక్షాలను, సైకిళ్ళను తరిమేశారు. పెద్దలొచ్చే రోడ్డంతా శుభ్రంగా వూడ్చేశారు. తెల్లని కోటు ధరించిన ఎఱ్ఱ బుట్టల టోపీవాళ్ళు కాస్సే పేక దా అన్నట్లు చిత్తశుద్ధితో పనిచేశారు.

అసలు ప్రారంభోత్సవానికి ముందు పద్మాకృతిలో వుండి దిశలకు చన్నీటిని వెదజల్లే ఆ "జలయంత్రాన్ని" ఎలా పనిచేస్తోందోనని ఒకేసారి పని చేయించారు. "వో హో"మని బోలెడు సంబరపడిపోయారు.

పిలుపు లేకపోయినా, చిరంజీవిరావు కూడా సందట్లో "సాడేమియా"అన్నట్లుదూరిపోయాడు. బాజాలు మ్రోగాయి. కొబ్బరికాయలు పగిలేయి. చప్పట్లు పేలేయి. అసలు హడావుడి అంతా పత్రికా విలేఖరులదే! ఫొటోగ్రాఫర్ల సంగతి సరే సరి!

ఇదంతా ప్రత్యక్షంగాచూసినా చిరంజీవిరావు తనివి తీరటంలేదు. పత్రికలన్నీ కొని ఒక్కొక్క పత్రికా, ఏమేం రాసిందో ఉబలాటంగా చదివేశాడు. "నగరంలో వినూత్న అధ్యాయం–సెంటర్లో జలయంత్ర విన్యాసం–" నేనయితే యిలా పెడుదును హెడ్డింగు అనికూడా అనుకున్నాడు.

* * *

మరొక రోజు!

చిరంజీవిరావు వెళ్లేసరికి

"వాటర్ ఫవుంటెన్" ఎక్కడికీ పోలేదు కాని, నీటి చిమ్మటాలలోనుంచి పడ్డ నీళ్ళన్నీ కుండీలో పడి, కుండీ నిండిపోయింది.

ఆ కుండీలోనుంచి ఒక వేపు కాల్వవొడ్డున పాకల్లో వుంటున్న పడుచు కాబోలు కడవముంచి నీళ్లు తీసుకుంటున్నది. చిరంజీవి రావుకి కోపం వచ్చింది అది చూడగానే.

అంతలో మల్లెపూల దుకాణాలవాళ్ళు చొక్కులతో నీళ్ళు తీసుకుపోయి, పూలమీదతాజాగా పూలు గుబాళించాలనే వుద్దేశ్యంతో జల్లేస్తున్నారు.

చిరంజీవిరావుకి చిరాకనిపించింది. అప్పుడే టిఫిన్ కారియర్ గిన్నెలు తెచ్చి అక్కడెవరో కడిగేసి వెళ్ళారు కాబోలు మెతుకులు, ఎంగిలి మిరపకాయ ముక్కలు అవీ కాకులు ఏరుకుని ఎగురుతున్నాయి. అప్పుడే ఒక సోడాలబండి వచ్చి అక్కడ ఆగింది. సోడాలమీద గోనెపట్టా తీసి యీ జలయంత్రం నీళ్ళలో తడిపివేసుకుంటున్నాడు సోడాల కుర్రాడు. వెర్రి ఆవేశం వచ్చింది చిరంజీవిరావుకి.

"సిటీబస్ దిగిన ఒక దూర ప్రాంతీయ పౌరుడు కాబోలు. కుండీఅంచు చప్టామీదికి ఎక్కిమరీ కాళ్లూచేతులూ ప్రక్షాళనం చేసుకుంటున్నాడు.

పల్లెటూళ్ళో మంచినీటి చెరువులో గేదెల్ని తెచ్చి కడుగుతున్నట్లుందా దృశ్యం చిరంజీవి రావు కళ్ళకి. అమాంతం వెళ్ళి ఏవణ్నో ఒకణ్ని పీక నొక్కేద్దామనుకున్నాడు! ఆ సెంటర్లో కంచు విగ్రహం పెకిలించేశారు. కొంత కాలంక్రితం అన్న సంగతిగుర్తుకు వచ్చింది. "ఎవరెలాపోతే మనకేంలే" అని సరిపెట్టుకున్నాడు. రోడ్డువార వేసిన పార్కులోనిద్రపోయి లేచి-అక్కడే గోడకి అభిముఖంగా "అల్పాచమానం' చేసుకుని వస్తున్న కుష్టుముష్టివాడు చిరంజీవిరావును రాసుకుంటూ వెళ్ళాడు. వెళ్ళి జలయంత్రం నీళ్ళలో కాళ్ళూ చేతులూ కడిగేసుకుని ఓ గుక్కెడు నీళ్ళు తాగేశాడు!

చిరంజీవిరావు వెర్రికోపంతో "ఏయ్! ఏమిటిది? ఈ వాటర్ ఫవుంటెన్‌ని మీరంతా యిలా 'మిస్ యూజ్' చేస్తున్నారన్నాడు గట్టిగా.

'అహ్హహ్హా!'అని నవ్వాడు అవతలివాడు.

"పామరుడా? ఎవరువువ్వు" అన్నట్లుందా నవ్వు!

"జనాలు నీళ్ళులేక ఛస్తా వుంటే యియ్యెందుకయ్యా? లోకుల సొమ్ములు లచ్చలు పోసి కట్టడం – పేదోళ్ళ పొట్టలు కొట్టి కట్టినయ్యేగా యియ్యన్నీ. దీనవ్వ మేం వాడుకుంటే తప్పా? అన్నాడు ముష్టివాడు.

"కావాలంటే మిస్టరూ! యీ కుండీ పెజల్ది. నువ్వూ వాడుకో యీ కుండీలో నీళ్లు... అన్నాడు మరొకడు.

"సోడా కొట్టేదా గురూ" అంటున్నాడు సోడాలకుర్రాడు.

చిరంజీవిరావు అక్కణ్నుంచి పిచ్చికుక్క వెంటబడి తరుముతున్నట్లు పారిపోయాడు!

వారం రోజులదాకా అటు జలయంత్రం దగ్గిరికి పోతేబట్ట-ఒకనాడు తప్పనిసరిగా స్టేషన్‌కి పోదామని అటువెళ్ళాడు. దూరంనుంచే చూడకూడదనుకుంటూనే జలయంత్రాన్ని చూచాడు. చచ్చిపోయిందది. నీళ్ళు సాయంకాలపు బాటసారుల పాలిటి పన్నీటి తుంపరలుగా జల్లటంలేదది ... కుండీలోకి చూశాడు. అడుగంటి కుళ్లిపోయాయి. నీళ్లు ఆకూ అలమూ, చెత్తాచెదారంతోనిండి! పోనీలే! అటు వ్యాధుల నీళ్ళ సోడాలు; మల్లెపూలు కొనుక్కునే దుర్గతి తప్పింది సామాన్య జనానికి అని తృప్తిపడ్డాడు చిరంజీవిరావు.

బాటప్రక్కపార్కులో నిర్వాసితమైన దోమలు పునర్వాసం ఏర్పర్చుకున్నాయి ఖరీదైన "జలయంత్రం"లో.


ఫోన్ : 74211

# పంచశీల జ్యూయలరీ వర్క్సు

శివాలయం వీధి : విజయవాడ - 1

ప్రొ॥ : టి. మల్లిఖార్జునరావు అండ్ సన్స్